

### బాలకృష్ణ తనయుడు
## మోక్షజ్ఞ తెరంగేట్రం

నందమూరి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ తొలి సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. బ్లాక్‌బస్టర్ 'హను-మాన్' ఫేం ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి తన ఎస్వీఎల్ సినిమాస్‌పై లెజెండ్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. బాలకృష్ణ చిన్నకుమార్తె తేజస్విని ఈ సినిమాకి సమర్పకురాలు కావడం విశేషం. శుక్రవారం మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఆయన్ని స్టైలిష్ అండ్ మోడరన్ అవతార్‌లో ప్రజెంట్ చేస్తూ ఓ స్టిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఆకర్షణీయమైన చిరునవ్వుతో, మెస్మరైజింగ్ ప్రజెన్స్‌తో చాలా అందంగా కనిపిస్తున్నారు మోక్షజ్ఞ. ప్రశాంత్‌వర్మ మాట్లాడుతూ 'మోక్షజ్ఞను హీరోగా పరిచయం చేసే అవకాశం రావడం గొప్ప గౌరవంగా, అంతకంటే పెద్ద బాధ్యతగా భావిస్తున్నా. ఇది ఇతిహాసాల నుంచి స్ఫూర్తి పొందిన స్క్రిప్ట్. ప్రశాంత్ వర్మ సినిమా యూనివర్స్‌లో ఇది ఒక భాగం. నా యూనివర్స్‌ని నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్లే సినిమా అవుతుంది. ప్రస్తుతం మోక్షూ నటశిక్షణలో ఉన్నారు. డ్యాన్స్, ఫైట్లు.. ఇలా ప్రతి విషయంలో స్పెషల్ ట్రైనింగ్ తీసుకుంటున్నారు. ఈ సినిమాతో ఓ గొప్ప స్టార్‌ని ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్న క్రెడిట్ నాకు దక్కనున్నది' అని ఆనందం వ్యక్తం చేశారు. 'మోక్షజ్ఞని హీరోగా లాంచ్ చేసే సువర్ణావకాశాన్ని మాకిచ్చిన బాలకృష్ణగారికి కృతజ్ఞతలు. ప్రశాంత్‌వర్మ అద్భుతమైన స్క్రిప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. మిగతా వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని నిర్మాత సుధాకర్ చెరుకూరి తెలిపారు.

### ఎన్టీఆర్ విషెస్

ఇదిలావుంటే.. మోక్షజ్ఞ తెరంగేట్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ ఇద్దరూ తన ఎక్స్(ట్విటర్) ద్వారా మోక్షజ్ఞకు శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. 'తాతగారి ఆశీస్సులతో నువ్వు పెద్ద హీరోగా ఎదగాలి' అంటూ తారక్, కల్యాణ్‌రామ్ తన ట్విటర్స్‌లో పేర్కొన్నారు.



## నిజమైన విజయానికి నిర్వచనం

'చుట్టూ వరదలు. చాలామంది కష్టాల్లో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో మా సినిమా ఆడియన్స్‌కి కొంచెం రిలీఫ్ ఇచ్చింది. ఇలాంటి సమయంలో మా సినిమాకు బ్రహ్మరథం పట్టిన ప్రేక్షకులకు థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. నిజమైన విజయానికి 'సరిపోదా శనివారం' ఓ నిర్వచనం. ఈ సక్సెస్ ప్రేక్షకులది. దర్శకుడిగా వివేక్ సక్సెస్ సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాకు పనిచేసిన అందరూ ప్రాణంపెట్టి పనిచేశారు. అందుకే ఈ విజయం. 'అంటే సుందరానికి' మంచి డ్రామా ఉన్న సినిమా. 'సరిపోదా శనివారం' మంచి యాక్షన్ సినిమా. ఈ సారి వివేక్‌తో మంచి కామెడీ సినిమా చేస్తా' అని నాని అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డి.వి.వి.దానయ్య, కల్యాణ్ దాసరి కలిసి నిర్మించిన ఈ సినిమా విజయోత్సవ వేడుక గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నాని మాట్లాడారు. ఈ సినిమాకోసం అందరూ అహర్నిశలూ కష్టపడ్డారని, ఈ విజయం అందరిదీ అని దర్శకుడు వివేక్ ఆత్రేయ అన్నారు. ఇంకా ఎస్.జె.సూర్య, ప్రియాంక్ అరుళ్‌మోహన్, సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్, అలీ, శుభలేఖ సుధాకర్, హర్షవర్ధన్‌లతో పాటు అతిథులుగా విచ్చేసిన దిల్‌రాజు, హను రాఘవపూడి, శివ నిర్వాణ, రాహుల్ సంకృత్యాన్ తదితరులు మాట్లాడారు.



## ట్రైలర్ వచ్చేది అప్పుడేనా?

ఎన్టీఆర్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా సినిమా 'దేవర'. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రం తొలి పార్ట్ ఈ నెల 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. దర్శకుడు కొరటాల శివ కచ్చితంగా విజయం సాధించాలనే కసితో ఈ ఫ్రాంచైజీని తెరకెక్కిస్తున్నారని నిర్మాతలు నందమూరి కల్యాణ్ రామ్, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ చెబుతున్నారు. ఇప్పటికే ప్రచారంలో భాగంగా విడుదలైన పాటలకు అద్భుతమైన స్పందన వస్తున్నది. ఇదిలావుంటే.. సినిమా విడుదల దగ్గరపడుతున్న సందర్భంగా ఈ నెల 10న ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. అయితే.. ఈ డేట్‌పై అధికారికంగా ఇంకా క్లారిటీ రావాల్సివుంది. జాన్వీకపూర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సైఫ్ ఆలీఖాన్ విలన్‌గా కనిపించనున్నారు. అనిరుధ్ సంగీత దర్శకుడు.



## నా జోలికొస్తే అంతే..!

మలయాళ ఫిల్మ్ ఇండస్ట్రీలోని కాస్టింగ్ కౌచ్ తీవ్రతపై జస్టిస్ కె.హేమ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ పుణ్యమా అని.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కాస్టింగ్ కౌచ్ అనేది చర్చనీయాంశంగా మారింది. తాజాగా నటి ఆదాశర్మ ఓ ప్రైవేటు ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కాస్టింగ్ కౌచ్‌కి సంబంధించిన ప్రశ్న ఆమెకు ఎదురైంది. మీ కెరీర్‌లో మీరెప్పుడైనా కాస్టింగ్ కౌచ్‌ని ఎదుర్కొన్నారా? అని ఆదాను అడగ్గా.. 'మీకు తెలీని విషయం ఏంటంటే.. నాకు మార్షల్ ఆర్ట్స్ బాగా తెలుసు. నాన్‌చాకు తిప్పడంలో నేను ఎక్స్‌పర్ట్. సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలు చేసేటప్పుడు ఎంత వేగంగా ప్రతిస్పందిస్తానో.. నాతో ఎవరైనా మిస్‌బిహేవ్ చేస్తే అంతే వేగంగా స్పందిస్తా. పక్కవాళ్ల అభిప్రాయాలు అస్సలు తీసుకోను. మనం ఏ రంగంలో ఉన్నా సపోర్ట్, నెట్‌వర్క్ అవసరం. నాకైతే నా ఇండస్ట్రీలో మద్దతిచ్చేవాళ్లు చాలామంది ఉన్నారు. అందుకే.. నా గురించి పూర్తిగా తెలిసిన ఎవరూ నా జోలికి రారు.' అంటూ అందంగా నవ్వేసింది ఆదాశర్మ.



## జాక్ కొంచెం క్రాక్

'టిల్లు స్క్వేర్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకొని జోష్ మీదున్నారు యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' ఉపశీర్షిక. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకుడు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. వైష్ణవి చైతన్య కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. ఇప్పటివరకు 80 శాతం చిత్రీకరణ పూర్తయిందని, ఈ నెల 15 నుంచి నేపాల్‌లో తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. సిద్ధు జొన్నలగడ్డ కామెడీ టైమింగ్ ఆద్యంతం చక్కటి వినోదాన్ని పంచుతుందని, యువత మెచ్చే అన్ని అంశాలుంటాయని దర్శకుడు పేర్కొన్నారు.



## ఉద్వేగాల వసంత

మెగా హీరో సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా రోహిత్ కెపి దర్శకత్వంలో ఓ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా సినిమా తెరకెక్కుతున్నది. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి ఈ చిత్రానికి నిర్మాతలు. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర పేరు వసంత. కథలో చాలా కీలకమైన కేరక్టర్ అది. ఐశ్వర్యలక్ష్మి ఈ పాత్రను పోషిస్తున్నది. శుక్రవారం ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా వసంతగా ఆమె కేరక్టర్‌ని పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఐశ్వర్యలక్ష్మి లుక్ భావోద్వేగపూరితంగా ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో వేసి భారీ సెట్‌లో ఈ సినిమాకు సంబంధించిన చిత్రీకరణ జరుగుతున్నది. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సాయిదుర్గతేజ్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారని, సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే చిరస్థాయిగా నిలిచిపోయే సినిమా అవుతుందని మేకర్స్ చెబుతున్నారు.

## తెలంగాణ నేపథ్య కథ



'హుషారు' చిత్రంతో యువతరంలో మంచి గుర్తింపుతెచ్చుకున్నాడు హీరో తేజస్ కంచర్ల. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ఉరుకు పటేల' నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాలభాను నిర్మించారు. ఈ సందర్భంగా హీరో తేజస్ కంచర్ల శుక్రవారం పాత్రికేయులతో మాట్లాడుతూ 'తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో నడిచే కథ ఇది. నేను పుట్టిపెరిగింది హైదరాబాద్‌లో కాబట్టి యాస విషయంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు. దర్శకుడు వివేక్ రెడ్డి కథ చెప్పగానే చాలా ఎక్సైట్ అయ్యాను. ఊరిలో జులాయిగా తిరిగే హీరో పట్నం నుంచి వచ్చిన అమ్మాయి ప్రేమలో పడతాడు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే సినిమా కథ. ఈ కథలో ఆద్యంతం నవ్వించే కామెడీతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి' అన్నారు. లాక్‌డౌన్ సమయంలో మూఢనమ్మకాల గురించి ఎక్కువగా వార్తలు చదివానని, అలాంటి కొన్ని సంఘటనల చుట్టూ అల్లుకున్న కథ ఇదని తేజస్ కంచర్ల తెలిపారు.

## ప్రతీ సినిమా ఓ సవాలు



'సినిమా చాలా బలమైన మాధ్యమం. రెండు గంటల్లో ఎన్నో అద్భుతాలు చేయొచ్చు' అన్నారు యువ హీరో విశ్వదేవ్. ఆయన నటించిన తాజా చిత్రం '35-చిన్న కథ కాదు' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. నివేదా థామస్, ప్రియదర్శి, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సందర్భంగా శుక్రవారం హీరో విశ్వదేవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ 'ప్రీమియర్స్ నుంచే ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభించింది. ప్రేక్షకులు, సినీ విమర్శకులు డిస్టింక్షన్ మార్కులు వేశారు. కెరీర్ ఆరంభంలో తండ్రి పాత్ర చేస్తున్నాను కాబట్టి ఆ తర్వాత అవకాశాల విషయంలో ఇబ్బంది అవుతుందని ఏ మాత్రం ఆలోచించలేదు. ఓ సవాలుగా తీసుకొని ఈ క్యారెక్టర్ చేశాను. ఇమేజ్ పట్టింపులు లేకుండా ప్రతీ సినిమాకు వైవిధ్యాన్ని ప్రదర్శించాలనుకుంటున్నా' అన్నారు. సినిమాలో తాను పోషించిన ప్రసాద్ పాత్ర అందరికి కనెక్ట్ అవుతున్నదని, కథ విన్నప్పుడే సినిమా చేయాలని ఫిక్సై పోయానని విశ్వదేవ్ పేర్కొన్నారు. కెరీర్ ఆరంభం నుంచి కథల విషయంలో కొత్తదనానికే ప్రాధాన్యతనిస్తున్నానని, తన కెరీర్‌లో అదిరిపోయిందనిపించిన సినిమా మాత్రం ఇదేనని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. సినిమాలోని బలమైన కుటుంబ బంధాలు మనసుల్ని కదిలిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా ఇదని విశ్వదేవ్ అన్నారు.








